క్లుప్తంగా

నేడు సమాచార హక్కు చట్టంపై అవగాహన

తాళ్లూరు: సమాచార హక్కు చట్టం 2005 ఇరవై సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా మండల కేంద్రంలోని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఆదివారం ఉదయం పది గంటలకు ఆర్టీఐ పై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించినట్లు ఎంపీడీవో పి. అజిత శనివారం ఓ ప్రకటనలో విడుదల చేశారు. కార్యక్రమానికి మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

పీఎం ధన్‌ధాన్య కృషి యోజనతో ఉపయోగాలు



ప్రధాని సందేశాన్ని వినిపిస్తున్న దృశ్యం

దర్శి: పీఎం ధన్‌ధాన్య కృషి యోజనతో రైతులకు ఉపయోగాలు ఉంటాయని కృషి విజ్ఞాన కేంద్ర కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ జీ రమేష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధాన మంత్రి ధన్‌ధాన్య కృషి యోజన ప్రత్యేక్ష ప్రసార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఈ పథకం రైతు సంక్షేమానికి, వ్యవసాయ సమృద్ధికి, దేశ ఆహారభద్రతకు మైలురాయిగా నిలుస్తుందన్నారు. రాబోయే ఆరు సంవత్సరాలపాటు, కేంద్ర ప్రభుత్వం ఈ పథకం కోసం భారీగా నిధులు వెచ్చిస్తూ, రైతు ఆదాయం పెరగడానికి, పంటల వైవిధ్యం సాధించడానికి, నిల్వ, ప్రాసెసింగ్ సదుపాయాలు పెంచడానికి అన్ని చర్యలు చేపట్ట బోతుందని వివరించారు. అదేవిధంగా ఈ యోజన ద్వారా దేశవ్యాప్తంగా 100 జిల్లాలను ప్రత్యేకంగా ఎంపిక చేశారన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ టీ వేంకటేశ్వర రెడ్డి, టీ మానస జిల్లాలోని వ్యవసాయ, అనుబంధ శాఖ అధికారులు ఎం రజని కుమారి, సుభాషిణి, ఎస్ సుచరిత,బాలాజి నాయక్, ఏఓలు, రైతులు, డీలర్లు పాల్గొన్నారు.

కూటమి కక్ష.. బాలికలకు శాపం!



నిరుపయోగంగా ఉన్న ఏనుగులదిన్నెపాడు బాలికల వసతి గృహం



వసతి గృహం చుట్టూ మొలిచిన పిచ్చి చెట్లు

- ఏనుగులదిన్నెపాడులో నిరుపయోంగా బాలికల హాస్టల్‌ను
- వినియోగంలోకి తీసుకురావాలని బాలికల ఆవేదన
- అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో బాలికలకు శాపం

పెద్దారవీడు: కూటమి ప్రభుత్వం, పాలకుల నిర్లక్ష్యం కారణంగా బాలికలు చదువుకు దూరం అయ్యే దుస్థితి నెలకొంది. కేవలం వైఎస్సార్ సీపీ హయాంలోని నిర్మించారన్న కోపంతో పక్కకు పడేశారు. మండలంలోని ఏనుగులదిన్నెపాడు గ్రామంలో కూటమి ప్రభుత్వం కారణంగా నూతనంగా నిర్మించిన బాలికల వసతి గృహం నిరూపయోగంగా మారింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అవరణంలో ఆర్ఎంఎస్ఏ ఫేజ్-5 రూ.1.94 కోట్ల నిధులతో బాలికల వసతి గహం నిర్మాణం పూర్తి చేశారు. అత్యాధునిక పద్ధతిలో వసతి గృహం, మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బాలికల వసతి భవనం 2023 ఫిబ్రవరి నెలలో ప్రారంభించారు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఈ హాస్టల్ భవనం వినియోగంలోకి తీసుకురాకుండా వదిలేశారు. ఈ హాస్టల్‌పై కూటమి పాలకులు, అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో దీన్ని బట్టి అర్థమవుతోంది. అన్ని హంగులతో నిర్మించిన భవనాన్ని పేద బాలికలకు మంచి విద్యనందించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కోట్లాది రూపాయల వ్యయంతో హాస్టల్‌ను నిర్మించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు ఏడాది గడిచినా ఎలాంటి స్పష్టత లేకుండా పోయింది.

విద్యాసంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలైనా..

వినియోగంలోకి తీసుకురావడంలో మాత్రం విద్యాశాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించకపోవడంతో బాలికలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ఏడాది జూన్ నెలలో ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభించారు. వలసలు వెళ్లే బాలికల కోసం నిర్మించిన హాస్టల్ అక్టోబర్ వచ్చినా కూడా ఇంత వరకు ప్రారంభం చేయకపోవడం ఏంటని బాలికలు, తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇతర ప్రాంతాలకు కూలీ పనులకు బాలికల తల్లిదండ్రులు వలసలు వెళ్లిన వారి బాలికల కోసం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుని హాస్టల్‌ల్లో వసతి కల్పించేందుకు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభించి దాదాపు 4 నెలలు అవుతున్నా ప్రారంభించక పోవడంపై బాలికల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్‌లో 100 మందికి వసతి కల్పించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. పాఠశాల ప్రారంభంలో హాస్టల్‌లో చేరేందుకు చుట్టుపక్కల మండలాల నుంచి 80 మంది బాలికలు దరఖాస్తులు చేసుకున్నారు. కానీ హాస్టల్ ప్రారంభించక పోవడంతో ఇతర పాఠశాలలో చేరామని బాలికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వార్డెన్, నైట్ వాచ్‌మెన్, వంట తయారు చేసేందుకు హెడ్‌కుక్, కుక్‌ను తాత్కలింగా రోజు వారి కూలీ ఇచ్చి నియమించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులు అనుమతి ఇచ్చారు. అయితే తాత్కలింగా రోజు వారి కూలీ రూ.200 ఇస్తామని చెప్పడంతో విధులు నిర్వహించేందుకు ఎవరు ముందుకు రావడంలేదు. ప్రభుత్వ హస్టల్‌లో రెగ్యులర్‌గా విధులు నిర్వహించే వారిలా వేతనాలు ఇవ్వాలని, పనులు నుంచి ఎప్పటికీ తొలగించకుండా ఉంచితే వస్తామని చెప్పడంతో ఏం చేయాలో అర్థంకాక అయ్యోమయంలో ఉన్నామని స్థానిక మండల విద్యాశాఖ అధికారులు చెప్తున్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి వసతి భవనాన్ని వినియోగంలోకి తీసుకునిరావాలని బాలికలతో పాటు తల్లిదండ్రులు కోరుతున్నారు.

బాలికల వసతి గృహాన్ని ప్రారంభించాలి..

పాఠశాలకు అనుసంధానం కోసం నిర్మించిన బాలికల వసతి గృహాన్ని వెంటనే ప్రారంభించాలి. వసతి గృహాన్ని నిర్మించి ప్రారంభించిన కూడా ఈ విద్యా సంవత్సరం అందుబాటులోకి తీసుకుని రాకపోవడం విచారకరం. నిరంతరం తల్లిదండ్రులు ఇతర ప్రాంతాలకు వలసలు ఉండటం వల్ల బాలికలు చదువు తరచూ మధ్యలోనే ఆగిపోతున్నాయి. ప్రభుత్వం వలసలను నివారించలేకపోయినా కనీసం బాలికల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని వెంటనే వసతి గృహాన్ని వినియోగంలోకి తీసురావాలి.

– దగ్గుపాటి సోమయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు

తిరుమలనాథస్వామికి భక్తుల పూజలు



తిరుమలనాథస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దారవీడు: మండల పరిధిలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి గ్రామం సమీపంలో వెలసిన రాజ్యలక్ష్మీ సమేత గొడ్రాలికొండ తిరుమలనాథస్వామికి శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. దేవాలయం అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించిన అనంతరం పట్టువస్త్రాలు, అభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి ఎదుట శ్రీచక్రం దగ్గర దంపతులు కుంకుమార్చన పూజలు చేశారు. సంతానం కలగాలని గిరికొండ చుట్టూ దంపతులు ప్రదక్షిణలు చేశారు. మహిళలు పొంగళ్లు తయారు చేసి స్వామికి నైవేద్యం చెల్లించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దేశ ప్రగతి కోసం ఆర్‌ఎస్ఎస్ పనిచేస్తుంది



ఆర్ఎస్ఎస్ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న నవీన్

త్రిపురాంతకం: ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు దేశ ప్రగతి కోసం పనిచేస్తున్నారని ఆ సంస్థ నెల్లూరు రీజియన్ ఆర్గనైజింగ్ సెక్రెటరి ఆర్ నవీన్ పేర్కొన్నారు. త్రిపురాంతకం మండలం మేడపి గణపతి మందిరంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ ఆర్ఎస్ఎస్ నిత్య శాఖ ద్వారా యువతను జాగృతం చేస్తుందన్నారు. నిత్య శాఖలో వ్యక్తి నిర్మాణం జరుగుతుందన్నారు. సంఘ స్వయం సేవకులు నేడు దేశంలో అన్ని రంగాల్లో దేశ పురోభివృద్ధికి, దేశ సౌభాగ్యానికి పాటుపడుతున్నారని వివరించారు. వంద సంవత్సరాల ప్రస్థానంలో ఎన్నో విజయాలు, ఒడిదుడుకులను ఎదుర్కొనడం జరిగిందన్నారు. నేడు ప్రపంచంలోనే పెద్ద స్వచ్ఛంద సంస్థగా పనిచేస్తుందని నవీన్ పేర్కొన్నారు. కార్యాక్రమంలో ఎస్ విశ్వనాథం, నాగబ్రహ్మాచారి, పి కృష్ణ, ఎస్ శ్రీనివాసరావు, హరికృష్ణ, సుధాకర్, బాలు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దొనకొండ ఫీల్డ్‌లోని పాస్టర్ల సమావేశం



మాట్లాడుతున్న సంఘ పెద్దలు

దొనకొండ: దొనకొండ ఏబీఎం తెలుగు బాప్టిస్ట్ చర్చ్ ఆవరణలో మండలంలోని బాప్టిస్ట్ పాస్టర్ల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రముఖులు పాల్గొని మాట్లాడారు. సీఎస్ 124/94 కేసులో మద్రాసు హైకోర్టు 19 డిసెంబర్ 2024 తేదిన ఏబీయం చర్చ్ ఆస్తులు గతంలో జరిగిన క్రయ విక్రయాలన్నిటిలో కూడా రద్దు పరచడమైనదని తీర్పు వెల్లడైందన్నారు. మరి ముఖ్యంగా దొనకొండ, దర్శిలోని ఏబీఎం చర్చ్ స్థలాలు కొనుగోలు చేసిన వారు, అమ్మినవారు స్థలాల్లో కట్టడాలు నిర్మించుకున్న వారు సైతం ఖాళీ చేసి సంస్థకు అప్పగించాలని మద్రాసు హైకోర్టు చెప్పిందన్నారు. ఈ కేసుకు సంబంధించిన డిక్రీ హోల్డర్స్ డి.అనిల్‌రాజ్, డి.సునీల్‌రాజ్, జాన్ జ్యోతి వివరించారు. కార్యక్రమంలో దొనకొండ, పొదిలి, మార్కాపురం సంఘ పెద్దలు కొన్ని విషయాలు చర్చించారు. కార్యక్రమంలో ఏబీఎం చర్చ్ ప్రెసిడెంట్ ఎండీ సుధాకర్, సెక్రటరీ ఎస్.సుధీర్, కమిటీ పెద్దలు పాల్గొన్నారు.





తాగునీటి బావి చుట్టూ చేరిన మురుగు



వీధుల్లో చేరిన మురుగు నిల్వలు

ఇలా ఉంటే రోగాలు రావా.. ?

- దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మురుగు నిల్వలు
- పెరుగుతున్న సీజనల్ వ్యాధులు
- నిద్రావస్థలో పొట్లపాడు పంచాయతీ అధికారులు



వీధుల్లో మురుగు..

కురిచేడు: మఅడపా దడపా కురుస్తున్న వర్షాలకు నీరు నిల్వలు చేరుతున్నాయి. గ్రామాలలో డ్రైనేజి వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు నిల్వలకు వర్షపు నీరు తోడై గ్రామాలలోని అంతర్గత రోడ్లు తటాకాలుగా మారుతున్నాయి. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో గ్రామంలోని వీధులను పరిశుభ్రంగా వుంచుతూ నీటి నిల్వలు లేకుండా చూడాల్సిన పంచాయతీ వ్యవస్థ నిద్రావస్థను నటిస్తుంది. వారిపై పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతుండటంతో గ్రామాలులో పరిశుభ్రత పడకేసింది. ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర పేరుతో అధికారులు ఫొటోలకు ఫోజులివ్వటంతో సరిపెడుతున్నారు తప్ప ఎక్కడా గ్రామాల్లో స్వచ్ఛత కనిపించటంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అందుకు మండలంలోని పొట్లపాడు గ్రామం నిదర్శనంగా నిలుస్తుంది. పొట్లపాడు గ్రామంలో ఏ వీధి చూసినా మురుగు నిల్వలు దుర్వాసన వెదజల్లుతూ దర్శనమిస్తున్నాయి. వర్షాలు కురిసి రైతులు, రైతు కూలీలు పొలం పనులలో బిజీగా వుంటున్నారు. బావులు,నీటి కుళాయిల వద్ద మురుగునిల్వలు చేరి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. పగలంతా కష్టపడి వచ్చిన రైతులు, కూలీలు ఆదమరచి నిద్రిస్తున్నారు. రాత్రి సమయంలో వారిపై దోమలు దాడిచేసి అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. ఇంత జరుగుతున్నా పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామంలోని మురుగు నిల్వలను తొలగించి బ్లీచింగ్ చల్లాలని, అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆ మలుపులు.. ప్రమాదానికి పిలుపులు



కొమరోలు : ఇడమకల్లు క్రాస్‌రోడ్డు వద్ద పెరిగిన పిచ్చిమొక్కలు

కొమరోలు: మండలంలోని మూలమలుపుల వద్ద దట్టంగా పిచ్చిమొక్కలు పెరగడంతో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. కొమరోలు నుంచి గిద్దలూరుకు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. ఆర్ అండ్‌బీ అధికారులు రహదారి మెయింటెనెన్స్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో రహదారికి ఇరువైపులా చిల్లచెట్లు, పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగిపోయాయి. దీంతో మూలమలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇడమకల్లు క్రాస్‌రోడ్డు వద్ద ముక్తాపురం, ఇడమకల్లు గ్రామాల మధ్య రాజుపాలెం గ్రామసమీపంలో దట్టంగా పిచ్చిమొక్కలు పెరిగాయి. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని వాహనదారులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఏపుగా పెరిగిన మొక్కలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కొమరోలు : రాజుపాలెం గ్రామ సమీపంలో మూలమలుపు వద్ద పెరిగిన పిచ్చిమొక్కలు

మట్టిరోడ్లను కమ్మేస్తున్న చిల్లచెట్లు



గొట్లగట్టు మర్రెడ్డుకుంట రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చిల్లచెట్లు



శ్మశాన వాటిక దారిలో చిల్లచెట్లలో ఉన్న బోరు

- చిల్లచెట్లతో మూసుకుపోతున్న దారులు
- వాహనదారులకు తప్పని తిప్పలు

కొనకనమిట్ల:

మండలంలోని పలు గ్రామాల్లో పొలాలకు వెళ్లే మట్టిరోడ్లకు ఇరువైపులా చిల్లచెట్లు అల్లుకపోవడంతో పొలాలకు వెళ్లే రైతులు, ట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ముఖ్యంగా మండలంలోని గొట్లగట్టు, కొనకనమిట్ల, కాట్రగుంట, పాతపాడు, వెలుగొండ్రాయునిపల్లి, నాయుడుపేట గ్రామాల పొలాలకు వెళ్లే దారుల్లో రోడ్డుపైకి చిల్లచెట్లు అల్లుకుపోతుండటంతో పొలాలకు వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. అదే సమయంలో పొలాలకు దుక్కులు దున్నేందుకు వెళ్లే ట్రాక్టర్లు ఎదురుపడినప్పుడు చిల్లచెట్లు ఉండటంతో పాటు మూల ములుపులు కూడా ఉండటంతో సైడు తొలగటానికి ఇబ్బందులు తప్పడం లేదని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ పాలకులు, అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా అల్లుకున్న చిల్ల చెట్లను తొలగించి రహదారులు అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చిల్లచెట్లలో మంచినీటి బోరింగ్..

మండలంలోని గొట్లగట్టు నుంచి వెలుగొండ్రాయునిపల్లి బీసీ కాలనీకి వెళ్లే దారిలో మంచినీటి బోరు చిల్లచెట్లలో మూసుకపోయింది. ఆదారిలోనే శ్మశాన వాటిక ఉంది. గొట్లగట్టు గ్రామంలో ఎవరైనా మృతి చెందినప్పుడు అంత్యక్రియలు చేసి వచ్చేటప్పుడు బోరింగ్ దగ్గర కాళ్లు కడుక్కుంటారు. గతంలో అవసరం నిమిత్తం దారి పక్కన బోరు ఏర్పాటు చేశారు. అయితే అంతవరకు బాగానే ఉన్నా బోరింగ్ చిల్లచెట్ల నడుమ మూసుకపోయింది. నీళ్ల వస్తున్నా ముళ్ల చెట్లతో మూసుకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించి వెళ్లేవారు బోరింగ్ పరిస్థితి చూసి ఉండి ఉపయోగం లేకుండా పోయిందని అసంతృప్తితో వెళుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారి పక్కన చిల్లచెట్లలో ఉన్న బోరింగ్ చుట్టూ అల్లుకుపోయిన చెట్లను తొలగించి బోరును వాడకంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

కనులపండువగా లక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణం

మార్కాపురం టౌన్: శ్రీదేవీ భూదేవి సమేత శ్రీ లక్ష్మిచెన్నకేశవస్వామి శాంతి కల్యాణాన్ని శనివారం స్వామివారి మధ్యరంగ మండపంలో అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉభయ దేవేరులతో కలిసి స్వామిని వివిధరకాల పూలు, ఆభరణాలతో అలంకరించారు. అనంతరం ఉభయదాతలు పట్టువస్త్రాలు సమర్పించగా ప్రధాన అర్చకులు అప్పనాచార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ఆటోల హడావుడి

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

మార్కాపురం: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆటోల హడావుడి ఎక్కువైంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనల ప్రకారం బస్టాండ్‌లోకి ఆటోలకు అనుమతి లేదు. అయినా కొంతమంది డ్రైవర్లు అత్యుత్సాహం చూపుతూ బస్టాండ్‌లోని ప్లాట్‌ఫాం వద్దకు బస్సు రాగానే డోర్ వద్దకు వెళ్లి ఆటోలు నిలుపుతున్నారు. దీంతో బస్సులో నుంచి దిగేవారు, ఎక్కేవారు ఒకరినొకరు తోసుకుంటూ కొట్లాడుకుంటున్నారు. 2 బస్సులు ఒకేసారి ప్లాట్‌ఫారం వద్దకు వచ్చి ఆగగానే ఆ బస్సుల మధ్య ఆటో పెట్టడంతో బస్సులో నుంచి దిగే ప్రయాణికులు బయటకు వెళ్లాలన్నా ఇబ్బందికరంగా మారింది. ఆర్టీసీ సిబ్బంది చోద్యం చూడటంతో ప్రయాణికులు ఆటో డ్రైవర్లతో గొడవలు పడుతున్నారు.

ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాం: నరసింహులు, డీఎం

మార్కాపురం బస్టాండ్‌లోనికి ఆటోలు రాకుండా ఉండేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాం. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. నిబంధనల ప్రకారం ఆటో డ్రైవర్లు బయటే ఉండాలి. బస్టాండ్‌లోకి ఆటోలను తీసుకుస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.



బస్టాండ్‌లో బస్సు పక్కన ఉన్న ఆటోలు